క్లుప్తంగా

నేడు బిక్కవోలు గోలింగేశ్వరస్వామి కల్యాణం



బిక్కవోలు: బిక్కవోలు ఉమా పార్వతీ సమేత గోలింగేశ్వరస్వామి కల్యాణం శుక్రవారం జరుగుతుందని ఆలయ ఈవో రామలింగ భాస్కర్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ కల్యాణానికి సకల ఏర్పాట్లు పూర్తయ్యాయని, శుక్రవారం తెల్లవారుజాము నుంచే అర్చకుల ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తారని చెప్పారు.

ఘనంగా లలితా సహస్ర నామ కుంకుమార్చన

బిక్కవోలు: మండలంలోని కొంకుదురులో నూతనంగా నిర్మించిన శ్రీలక్ష్మి గోదాదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాల్ని పురస్కరించుకుని లలితా సహస్ర నామ కుంకుమార్చన గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో కలశాల్ని ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు పూజల్లో పాల్గొన్నారు. అనంతరం అన్న సమారాధన చేశారు.

ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి కృషి చేయాలి



దోమాడలో పూడిక తొలగింపు పనుల్ని పరిశీలిస్తున్న ఎంపీపీ తులసి

పెదపూడి: గ్రామాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుతూ ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి అధికారులు, ప్రజలు కృషి చేయాలని ఎంపీపీ కేతా తులసి అన్నారు. దోమాడ, కరకుదురు, పెదపూడి, రామేశ్వరం, ఏపీత్రయం గ్రామాల్లో మురుగు కాల్వల్లో జేసీబీ సహాయంతో తొలగిస్తున్న పూడిక పనులను ఎంపీపీ తులసి, ఎంపీడీఓ పి.విజయభాస్కర్, ఈఓపీఆర్డీ కె.హరికృష్ణ సత్యరెడ్డి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవి నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శులు బి.ప్రసన్నకుమార్, తరుణ్, మన్యం శ్రీనివాసు చౌదరి, కేతా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

956 మందికి వైద్యసేవలు



మునికూడలిలో ఇంటి వద్ద మహిళకు వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ రాజు

సీతానగరం: మునికూడలిలో గురువారం జరిగిన ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమంలో సీతానగరం పీహెచ్‌సీ డాక్టర్ ఎస్.రాజు 956 మందికి వైద్యసేవలందించారు. అవసరమైన వారికి పరీక్షలు జరిపి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మంచంపై ఉన్న రోగులకు వారి ఇంటి వద్దే వైద్యం చేశారు. ఎంపీయూపీ స్కూల్‌ను సందర్శించి, విద్యార్థులకు ఆరోగ్య విషయాలపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు జరిపారు. కార్యక్రమంలో హెచ్‌వీ లక్ష్మి, హెచ్‌ఏ రూప్‌కుమార్, ఏఎన్‌ఎంలు కుమారి, బుజ్జి, ఆశావర్కర్లు వెంకటలక్ష్మి, రామకుమారి పాల్గొన్నారు.

భోజనం ప్యాకెట్ల వితరణ



భోజనం అందజేస్తున్న సేవామందిరం సభ్యుడు

సీతానగరం: చినకొండేపూడిలోని షిర్డీ సాయిబాబా వసతి మందిరం ఆధ్వర్యంలో దాత చిడిపి శ్రీను సహకారంతో గురువారం నిరుపేదలకు భోజనం ప్యాకెట్లు అందజేశారు. సుమారు 150 మంది పేదల ఇళ్లకు వెళ్లి మందిరం సేవాసమితి సభ్యులు అందజేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రంగంపేట: మండలంలోని రంగంపేట, వడిశలేరు, ఈలకొలను, జి.దొంతమూరు విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని పలు గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని జగ్గంపేట విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె. రత్నాలరావు తెలిపారు. రాజానగరం 132/33 కేవీ విద్యుత్ ఉపకేంద్రంలో వార్షిక మరమ్మతుల కారణంగా ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు, వ్యవసాయ బోర్లకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఇంటర్మీడియెట్ పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో పరీక్షా కేంద్రాల వద్ద విద్యుత్‌కు ఆటంకం కలగకుండా చర్యలు చేపడుతున్నట్టు రంగంపేట ఏఈ సీహెచ్ నాగేశ్వరరావు చెప్పారు.

భూవివాదాలకు ముకుతాడు

- చురుగ్గా డ్రోన్ సర్వే
- పారదర్శకంగా నిర్వహణ



గాడాలలో డ్రోన్ ద్వారా భూ రీసర్వే చేస్తున్న అధికారులు

మధురపూడి: మానవుల మనుగడకు భూమి ఎంతో అవసరం. నివాసం ఉండడానికి, పంటలు పండించడానికి, జీవనం సాగించడానికి అత్యంత ముఖ్యం. ఈ నేపథ్యంలో కొన్నిచోట్ల భూమి ఆక్రమణకు గురవుతోంది. వివాదాల కారణంగా నిరుపయోగంగా ఉండిపోతోంది. దాని కోసం అనేక గొడవలు కూడా జరుగుతున్నాయి. దీంతో రైతులందరికీ వారి భూమిపై హక్కు కలిగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్షణ పథకంలో భాగంగా డ్రోన్ సర్వే నిర్వహిస్తోంది. ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా భూవివాదాలు దాదాపు పరిష్కారమవుతాయి. రాజానగరం నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ఈ సర్వే జరుగుతోంది. కోరుకొండ మండలం గాడాలలో గురువారం ప్రారంభమైంది.

రాజానగరం నియోజకవర్గంలో..

రాజానగరం నియోజకవర్గంలోని 3 మండలాల్లో 72 గ్రామాలున్నాయి. మొత్తం 54,671 హెక్టార్ల విస్తీర్ణంలో మొత్తం భూమి ఉంది. దీనిలో పంట పొలాలు, తోటలున్నాయి. అలాగే 72 గ్రామాల్లోని ఇళ్ల స్థలాలను సర్వే చేయాలి. సుమారు వందేళ్ల క్రితం బ్రిటిష్ పాలనలో భూ సర్వే జరిగింది. నాటి నుంచి నేటి వరకూ సర్వే నిర్వహించలేదు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమం చేపట్టింది. దీంతో భూతగాదాలు, న్యాయస్థానంలో వివాదాల్లో ఉన్న భూములకు విముక్తి లభించనుంది. కోర్టు వివాదాల కారణంగా ఖాళీగా ఉన్న పొలాలు సాగుకు నోచుకుంటాయి. పంట విస్తీర్ణం పెరుగుతోంది. తద్వారా ఆహార కొరత ఉండదు.

డ్రోన్ సర్వే జరిగే తీరు

డ్రోన్ సర్వే ద్వారా గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని, గ్రామాల వారీగా నిర్వహిస్తారు. తొలుత గ్రామంలోని సరిహద్దులు, కిలోమీటర్లు నిర్ధారణ చేస్తారు. సాంకేతిక పరమైన పరిజ్ఞానంతో ఈ సర్వేను నిర్వహిస్తున్నారు. డ్రోన్ తీసుకొచ్చిన ఫొటోలు, ఇతర వివరాలను జియోట్యాగింగ్ చేసి సర్వే ఆఫ్ ఇండియా (ఎస్ఓఐ)కు పంపిస్తారు. అక్కడ ప్రోసెస్ చేస్తారు. ఆయా గ్రామాల మ్యాప్‌ల ఆధారంగా ప్రతి రైతు భూమిని, ప్రతి ఇంటి స్థలాన్ని విస్తృతంగా సర్వే చేస్తున్నారు.

సర్వేకు సహకరించాలి



భూ రీసర్వేకు ప్రతి ఒక్కరూ సహకరించాలి. గాడాలలో గురువారం ప్రారంభమైన ఈ కార్యక్రమం మండలంలోని అన్ని గ్రామాల్లో నిర్వహిస్తాం. పొలాలు, ఇంటి స్థలాలన్నింటినీ సర్వే చేస్తాం. ఆయా యజమానులందరూ సర్వే సమయంలో హాజరై, వివాదాలకు తావులేకుండా సర్వే చేయించుకోవాలి.

– పాపారావు, తహసీల్దార్, కోరుకొండ

భూసమస్యలకు పరిష్కారం



ఎన్నోఏళ్లుగా భూములు, ఇళ్ల స్థలాల సమస్యలు పరిష్కారం కాకుండా ఉన్నాయి. సరిహద్దు గొడవలతో ఇళ్ల స్థలాలు, పంట పొలాలు సైతం కోర్టు వివాదాల్లో ఉంది. వివాదాస్పద భూముల పరిష్కారానికి వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్షణ పథకం దోహద పడుతోంది.

– గణేశుల నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ కోకన్వీనర్, కోరుకొండ

సీఎం జగన్ ముందుచూపు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముందుచూపుతో వ్యవహరిస్తున్నారు. భూవివాదాలకు చెక్ పెడుతున్నారు. భవిష్యత్తులో సమస్యలు ఉత్పన్నం కాకుండా రీసర్వే చేపట్టారు. దాదాపు బ్రిటీష్ వారి హయాంలో వందేళ్ల క్రితం ఇలా సర్వే చేశారు. ఇప్పుడు మళ్లీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నిర్వహిస్తున్నారు.

– కంటే వినయ్‌తేజ, వ్యవసాయ సలహామండలి సభ్యుడు

అందుబాటులో జీవన ఎరువులు



వడిశలేరులో తయారుచేసిన జీవన ఎరువులతో సిబ్బంది

రంగంపేట: ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు కావలసిన జీవన ఎరువులు అందుబాటులో ఉన్నాయని ఏపీసీఎన్ఎఫ్ ఎస్డీఏ వేమగిరి అన్నపూర్ణ తెలిపారు. వడిశలేరులోని కేఎల్ వ్యవసాయ క్షేత్రంలో గురువారం ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా మొక్కలకు కావలసిన పోషకాలు నేల ద్వారా ఇవ్వడానికి 15 రకాల పోషకాలతో పాటు మొక్కలకు ఆశించే తెగుళ్లకు పిచికారీ చేయడానికి 7 రకాల ఫంగస్ మాధర్ కల్చర్స్ (జీవన ఎరువులు) స్వయంగా తయారుచేసి రైతులకు చూపించారు. ఈ ఎరువులు వాడకం వల్ల మొక్కలకు కావలసిన పోషకాలు అందడమే కాకుండా, మొక్కలకు ఆశించే పురుగులు, తెగుళ్ల నశిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్డీఏ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

18న అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ

బిక్కవోలు: మండలంలోని బలభద్రపురం గ్రామంలో శ్రీదేవి భూదేవి ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయం వెనుక భాగంలో నూతనంగా నిర్మిస్తున్న మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో 18వ తేదీన విగ్రహ ప్రతిష్ఠ చేయనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాల్లో భాగంగా గురువారం ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు.

అన్ని వర్గాలకూ ఉపయోగం

మధురపూడి: రాష్ట్ర బడ్జెట్ అన్ని వర్గాల ప్రజలకు ఆమోదకరమైనదిగా ఉందని వైఎస్సార్ సీపీ కన్వీనర్ అడపా కనకరాజు, మాజీ కన్వీనర్ ఉల్లి బుజ్జిబాబు అన్నారు. ఈ మేరకు గురువారం సంయుక్త ప్రకటన విడుదల చేశారు. వ్యవసాయం, విద్య, వైద్యం తదితర శాఖలకు మంచి ప్రాధాన్యతిచ్చారన్నారు. కార్మిక, కర్షక, విద్యార్థి, మేధావులకు ఉపయోగకరంగా ఉందన్నారు.

ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

రాజానగరం: నులి పురుగుల నివారణలో భాగంగా దివాన్ చెరువులోని వీజేస్ ఫార్మసీ కాలేజీలో విద్యార్థులకు గురువారం ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. శరీరంలో నులి పురుగులు ఉండటం వలన పోషకాహార లోపంతోపాటు రక్తహీనత, నీరసం, మానసిక రుగ్మతలు ఏర్పడతాయని హెల్త్ అసిస్టెంట్ పి.వుల్లారావు ఏఎన్ఎం సుభాషిణి వివరించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ ఎన్‌వీవీ జగన్‌మోహన్‌రెడ్డి, చైర్‌పర్సన్ ఎన్.శకుంతల, ప్రిన్సిపాల్ డాక్టర్ డి.నరేంద్ర, ఎన్‌సీసీ పీఓ కిషోర్ పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు త్యాగం మరువలేనిది

ఘనంగా అమరజీవి జయంతి వేడుకలు



పెదపూడి ఎంపీడీవో కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎంపీపీ కేతా తులసి



నన్నయ యూనివర్సిటీలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం



కోరుకొండలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న ఆర్యవైశ్యులు

పెదపూడి: ఆంధ్ర రాష్ట్ర అవతరణకు అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం మరువలేనదని ఎంపీపీ కేతా తులసి, జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు నిర్వహించారు. ఎంపీపీ తులసి, జెడ్పీటీసీ సభ్యురాలు వెంకటలక్ష్మి అమరజీవి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పి.విజయభాస్కర్, ఈఓపీఆర్డీ కె.హరికృష్ణ సత్యరెడ్డి, ఉపాధి హామీ పథకం ఏపీఓ నాగమణి, కాండ్రేగుల ఎంపీటీసీ సభ్యుడు పేపకాయల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

దోమాడలో సర్పంచ్ మీనవల్లి శారదదేవి ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు నిర్వహించారు.

రంగంపేట: స్థానిక శాఖా గ్రంథాలయంలో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు చిత్రపటానికి గ్రంథాలయాధికారి ఎస్.రామ కోటేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయంలో ఉన్న మహనీయుల జీవిత చరిత్రలను చదివి వారి మార్గదర్శనంలో నడవాలన్నారు. కార్యక్రమంలో టి.దుర్గాప్రసాద్, నాగేంద్ర, వినీంద్ర, రమేష్‌బాబు, గన్నెమ్మ, శ్రీను పాల్గొన్నారు.

బిక్కవోలు: బిక్కవోలు మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీవో ఝాన్సీ పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కొంకుదురు ఉన్నత పాఠశాల వద్ద పాఠశాల హెచ్ఎం కొవ్వూరి అమ్మిరెడ్డి ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమరజీవి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మెళ్లూరు ఉన్నత పాఠశాల హెచ్ఎం మూర్తి ఆధ్వర్యంలో అమరజీవి జయంతి వేడుకలు జరిగాయి.

గోకవరం: అమరజీవి పొట్టిశ్రీరాములు జయంతిని స్థానిక శ్రీవాసవీ ఆర్యవైశ్య సేవా సంఘం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపం ఆవరణలోని పొట్టి శ్రీరాములు, గాంధీ విగ్రహాలకు సంఘం అధ్యక్షుడు బత్తుల నానాజీ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. ప్రతీ ఒక్కరూ పొట్టిశ్రీరాములు త్యాగాన్ని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు సేవలు చిరస్మరణీయం

మధురపూడి: ఆంధ్రరాష్ట్ర సాధనకు పొట్టి శ్రీరాములు చేసిన సేవలు చిరస్మరణీయమని వక్తలు కొనియాడారు. అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. కోరుకొండ బస్టాండ్ సెంటర్‌లోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘం అధ్యక్షుడు బొండాడ చందు, కార్యదర్శి గ్రంధి కాశీ, నాయకులు సత్యవరపు రాజాపండు, వాకచర్ల గోపి, కప్పల స్వామి పాల్గొన్నారు.

'నన్నయ'లో పొట్టి శ్రీరాములు జయంతి

రాజానగరం: అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని ఆదికవి నన్నయ యూనివర్సిటీలో గురువారం వేడుకగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి రిజిస్ట్రార్ ఆచార్య టి. అశోక్ పూలమాల వేసి, నివాళులర్పించారు. ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం 58 రోజులపాటు ఆమరణ నిరాహార దీక్ష చేసి, ప్రాణాలర్పించిన ఆయన కార్యదీక్షను కొనియాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ ఆచార్య ఎస్. టేకి, డాక్టర్ పి. విజయనిర్మల, డాక్టర్ పి .వెంకటేశ్వరావు. డీన్స్ ఆచార్య పి. సురేష్‌వర్మ, డాక్టర్ ఎన్. ఉదయ్‌భాస్కర్, డాక్టర్ ఎం. గోపాలకృష్ణ, అసిస్టెంట్ రిజిస్ట్రార్ జి. చంద్రకళ పాల్గొన్నారు.

- రాజానగరం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గ్రామంలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం పక్కనే ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి అభిషేకాలు చేసి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. గ్రంధి నానబ్బులు, సముద్రాల రాంబాబు, మండవల్లి వెంకన్నబాబు, దవళూరి గిరిబాబు, గ్రంధి రాజా పాల్గొన్నారు.

సచివాలయాలకు ఆదాయం పెంచాలి



కాండ్రేగులలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఈఓపీఆర్డీ కె.హరికృష్ణ సత్యరెడ్డి

పెదపూడి: చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలతో గ్రామ సచివాలయాలకు అదనపు ఆదాయం పెంచడానికి కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలని ఈఓపీఆర్డీ కె.హరికృష్ణ సత్యరెడ్డి అన్నారు. కాండ్రేగుల గ్రామంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఆయన గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా హరికృష్ణ సత్యరెడ్డి మాట్లాడుతూ వర్మీ కంపోస్టు ఎరువు రైతులకు నిబంధనల ప్రకారం విక్రయించాలన్నారు. వివిధ రకాల పండ్ల మొక్కలు, కొబ్బరి, అరటి, బీర, ఆనప మొదలైన కాయ, ఆకు కూరలు పండించి సచివాలయానికి ఆదాయం పెంచాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ కేవీవీ సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు పేపకాయల వెంకటరమణ, సచివాలయం కార్యదర్శి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బీమా సొమ్ము అందజేత



బాధిత కుటుంబానికి బీమా సొమ్ము అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

గోకవరం: గ్రామానికి చెందిన కోర్పు సత్యనారాయణ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించారు. మృతుడి కుటుంబానికి ప్రభుత్వం నుంచి రూ.5 లక్షలు మంజూరు కాగా ప్రస్తుతం దహన ఖర్చుల కోసం రూ.10 వేలు మంజూరయ్యాయి. ఈ నగదును గురువారం వైఎస్సార్ సీపీ నాయకుడు సుంకర వీరబాబు తదితరులు బాధిత కుటుంబానికి అందజేశారు. మిగిలిన నగదు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో జమవుతుందని ఆయన తెలిపారు. పార్టీ నాయకులు నరాలశెట్టి సర్వయ్య, పులపర్తి బుజ్జి, తదితరులు పాల్గొన్నారు.

పరీక్షలకు పదిమంది గైర్హాజరు

రంగంపేట: రంగంపేటలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో నిర్వహిస్తున్న ఇంటర్మీడియట్ పరీక్షల్లో రెండో రోజైన గురువారం ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు తెలుగు, సంస్కృతం పేపర్–2 పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలో 210 మంది హాజరు కావాల్సి ఉండగా 204 మంది, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రంలో 218 మంది హాజరు కావాల్సి ఉండగా 214 మంది హాజరయ్యారని, మరో 10 మంది గైర్హాజరయ్యారని పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ కేవీ రామకృష్ణ, సీహెచ్‌ఏ శిరీషలు తెలిపారు. పరీక్షా కేంద్రాలను హైపర్ కమిటీ మెంబర్ మూర్తిరాజు, సిట్టింగ్ స్క్వాడ్ వీఆర్ఎస్‌కే శాస్త్రి, పి.ఆనందరావు తనిఖీ చేశారు.

కోరుకొండలో 20 మంది..

మధురపూడి: కోరుకొండ రాజబాబు జూనియర్ కాలేజీలో గురువారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్ష ప్రశాంతంగా జరిగింది. 473 మంది విద్యార్థులకు తొలిరోజు తెలుగు పరీక్షను 453 మంది రాశారు. మిగిలిన 20 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.

వైభవంగా పునఃప్రతిష్ఠాపనోత్సవాలు



ఉత్సవమూర్తులు

రాజమహేంద్రవరం రూరల్: తొర్రేడు గ్రామంలో ఒనువులమ్మ ఆలయ పునఃప్రతిష్ఠాపనోత్సవాలు గురువారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజులు జరిగే ఈ కార్యక్రమాల్లో భాగంగా గురువారం ఉదయం ఆలయం పక్కనే గల హోమశాలలో విఘ్నేశ్వరపూజతో మొదలై దీక్షాధారణ, అగ్ని ప్రతిష్ఠాపనం, ధ్వజారోహణం, ప్రసాద వితరణతో ముగిశాయి. మధ్యాహ్నం ఉత్సవ మూర్తులకు జలాధివాసం అత్యంత వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

వెంకన్న హుండీ ఆదాయం లెక్కింపు వాయిదా

అక్రమాలపై విచారణ చేపట్టాలని పాలకవర్గం డిమాండ్



దేవదాయ శాఖ అధికారులకు వినతి పత్రం అందజేస్తున్న పాలకవర్గం సభ్యులు

గోకవరం: మండలంలోని తంటికొండ వేంకటేశ్వర స్వామి దేవస్థానం హుండీల ఆదాయం లెక్కింపు వాయిదా పడింది. ఆలయంలో అక్రమాలపై విచారణ చేపట్టకుండా హుండీ ఆదాయం లెక్కించవద్దని పాలకవర్గం సభ్యులు పట్టుబట్టారు. వివరాల్లోకి వెళితే.. దేవస్థానంలో హుండీల ఆదాయం లెక్కింపునకు గురువారం అధికారులు ఏర్పాట్లు చేశారు. కాకినాడ దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో హుండీల లెక్కింపునకు ఏర్పాట్లు చేస్తుండగా దేవస్థానం చైర్మన్ బద్దిరెడ్డి రాంబాబు(రెడ్డి), ఇతర పాలకవర్గం సభ్యులు అడ్డుకున్నారు. ఆలయంలో పలు అక్రమాలు జరిగాయని, వీటిపై విచారణ నిర్వహించకుండా హుండీ ఆదాయం ఏ విధంగా లెక్కిస్తారని ప్రశ్నించారు. విచారణకు, హుండీ లెక్కింపునకు ఎటువంటి సంబంధం లేదని అధికారులు తెలిపినప్పటికీ పాలకవర్గం ససేమేరా అనడంతో ఉద్రిక్తత నెలకొంది. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యగా ఎస్సై యూవీ శివనాగబాబు సిబ్బందితో ఆలయం వద్దకు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. విషయం తెలుసుకున్న మండలం సచివాలయ కన్వీనర్ దాసరి రమేష్, వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్ ఆలయం వద్దకు చేరుకుని అధికారులు, పాలకవర్గం సభ్యులతో మాట్లాడారు. మధ్యాహ్నం వరకు చర్చలు జరిగాయి. దీంతో హుండీ ఆదాయం లెక్కింపునకు, ఆ సొమ్మును బ్యాంకులో డిపాజిట్ చేసేందుకు తగిన సమయం లేకపోవడంతో హుండీ ఆదాయం లెక్కింపును తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్టు దేవదాయశాఖ అధికారులు ప్రకటించారు. అనంతరం దేవస్థానంలో అక్రమాలపై విచారణ నిర్వహించాలని ఆయనకు పాలవకర్గం సభ్యులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఈఓ ఆర్‌వీ చందన, తదితరులు పాల్గొన్నారు.

బాలుడి వైద్యానికి రూ.27 వేలు అందజేత



బాలుడి వైద్యానికి ఆర్థిక సహాయం అందజేస్తున్న సెయింట్ జాన్స్ లూథరన్ చర్చి సభ్యులు

గోకవరం: అరుదైన బోన్‌మేరో వ్యాధితో చైన్నై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గోకవరానికి చెందిన అక్షయ్‌రామ్ వైద్యానికి స్థానిక సెయింట్ జాన్స్ లూథరన్ చర్చి సంఘ సభ్యులు రూ.27 వేలు ఆర్థిక సహాయం అందించారు. బాలుడి ఆరోగ్య పరిస్థితిపై చలించిన సంఘం సభ్యులు నగదును సమకూర్చారు. ఈ మొత్తాన్ని గురువారం జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పాలూరి బోసుబాబు, తూర్పుగోదావరి జిల్లా వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ ఎస్ఎస్ ఆలీషాలకు అందజేశారు. తొలుత బాలుడి ఆరోగ్యాన్ని కాంక్షిస్తూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో సంఘం పాస్టర్ ఎస్ఆర్‌కే స్టీఫెన్, సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన బైబిలు మిషను సభలు

రాజమహేంద్రవరం రూరల్: ఏసుక్రీస్తు బోధనలను ఆచరించి, ప్రపంచశాంతికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఆంధ్రప్రదేశ్ పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు రెవరెండ్ బిషప్ కె.ప్రతాప్ సిన్హా అన్నారు. మార్గాని ఎస్టేట్ ఆవరణలో మూడు రోజులు జరిగిన బైబిలు మిషను 56వ మహాసభలు గురువారంతో ముగిశాయి. చివరి రోజు సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరైన దైవ ప్రసంగం చేశారు. రెవరెండ్ సుధీర్ కుమార్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వచ్చిన భక్తులకు మహాసభల నిర్వాహకులు, కన్వీనర్ ఎన్‌జే షారోన్ కుమార్, కో కన్వీనర్, పాస్టర్ ఎస్.సుదన్ షారోన్, టి.రతన్ రాజు, సుదర్శన్ షాపింగ్ మాల్ అధినేత లావేటి సుదర్శన్ తదితరులు భోజనం, వసతి సౌకర్యాలు కల్పించారు.

'అప్పు తీసుకుని చెల్లించడం లేదు'

కడియంలో పలువురి ఆందోళన

కడియం: మండల కేంద్రమైన కడియంలో ఉన్నత పాఠశాల వెనుకవైపున గల జయరామ్ ఎలక్ట్రికల్స్ యజమాని కొప్పిశెట్టి జయరామ్ తమ వద్ద అప్పు తీసుకుని, తిరిగి ఇమ్మంటే దుర్భాషలాడుతూ దౌర్జన్యం చేస్తున్నాడని పలువురు బాధితులు గురువారం రాత్రి ఆందోళనకు దిగారు. వీరిలో ఎక్కువ మంది అతడి బంధువులే ఉండడం గమనార్హం. వివరాల్లోకి వెళితే.. కడియపుసావరం గ్రామానికి చెందిన జయరామ్ కడియంలో జయరామ్ ఎలక్ట్రికల్స్ వ్యాపారం నిర్వహిస్తున్నాడు. పలువురి వద్ద ఇతడు భారీ ఎత్తున అప్పులు తీసుకున్నాడు. భారీ షాపింగ్ కాంప్లెక్స్‌లో పెద్ద ఎత్తున వ్యాపారం నిర్వహించే అతడిని చూసి మండలంలోని పలువురు, అతడి బంధువులు కూడా అప్పులు ఇచ్చారు. కొన్నాళ్లు బాగానే సాగిన ఈ వ్యవహారం తిరిగి అప్పులు చెల్లించకపోవడంతో ఇప్పుడు రోడ్డున పడింది. ఇటీవల తమ డబ్బులు తిరిగి ఇవ్వాలని రుణదాతలు ఒత్తిడి చేస్తున్నారు. కానీ జయరామ్ డబ్బులు ఇవ్వకుండా వాయిదాలు వేస్తున్నాడు. పలువురి పెద్దల్లో ఇప్పటికే పలు పంచాయతీలు కూడా అయ్యాయి. దీంతో గురువారం రాత్రి డబ్బులు అడిగేందుకు మరోమారు షాపు వద్దకు భారీ ఎత్తున రుణదాతలు చేరుకున్నారు. అడిగితే తమపై జయరామ్ తదితరులు దుర్భాషలాడుతూ, దౌర్జన్యానికి దిగారని బాధితులు తెలిపారు. ఈ నేపథ్యంలో పోలీస్‌లకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమయ్యారు.

బాధితులతో పోలీసుల చర్చలు

రుణాలు ఎగవేసే ఉద్దేశంతోనే సదరు వ్యక్తి ఉన్నాడని బాధితులు చెబుతున్నారు. అతడి పేరిట ఎటువంటి ఆస్తులు లేకుండా ముందు జాగ్రత్తగా బంధువుల పేరిటకు మార్చివేశాడని ఆరోపిస్తున్నారు. ఆందోళన నేపథ్యంలో పోలీసు సిబ్బంది అక్కడకు చేరుకుని బాధితులతో చర్చిస్తున్నారు. బాధితుల్లో కొప్పిశెట్టి నాగలక్ష్మి రూ. 23 లక్షల అప్పుగా ఇచ్చింది. దూనబోయిన జ్యోతి, గుబ్బల సత్యనారాయణ, పిల్లి సత్యవతి, దుంగల వెంకటరమణ, దూనబోయిన జ్యోతి, దూనబోయిన సంజయ్, తోట వెంకటరమణ, కానుబోయిన సత్యనారాయణ, కానుబోయిన ధైర్యలక్ష్మి, ఎల్.సత్యనారాయణ, కొప్పిశెట్టి సూర్యకాంతం తదితరులు కూడా డబ్బులు ఇవ్వాలని చెబుతున్నారు. ఇదిలా ఉండగా బాధితుల ఆందోళన నేపథ్యంలో జయరామ్ అందుబాటులో లేకపోవడంతో అతడి సోదరుడు శ్రీనివాస్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. బాధితులు కూడా స్టేషన్‌కు తరలివచ్చారు. ఇదిలా ఉండగా బాధితులంతా తమపైనే దౌర్జన్యం చేశారని జయరామ్ కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.